పడకేసిన పల్లె పాలన..!

- నిధుల లేమితో సతమతం
- పారిశుద్ధ్య నిర్వహణ గాలికి
- జ్వరాలబారిన పడుతున్న ప్రజలు
- మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు

సోంపేట:

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉంటే ప్రజలు అనారోగ్యాలకు దూరంగా ఉంటారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాలికొదిలేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని వాపోతున్నారు. కాగా దోమల నివారణకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఫాగింగ్ మిషన్లను పంచాయతీలకు అందజేసింది. అయితే నిర్వహణ లోపంతో ఫాగింగ్ మిషన్లు చాలా పంచాయతీల్లో మరమ్మతులకు గురయ్యాయి.

పీడిస్తున్న జ్వరాలు

ప్రస్తుతం గ్రామాల్లో దోమలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దీంతో ఆస్పత్రులకు తిరుగుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే దోమలు నియంత్రించడానికి కనీసం ఏడాదికి ఒక్కసారైనా ఫాగింగ్ చేసే పరిస్థితి పంచాయతీల్లో కనిపించడం లేదు. గతేడాది ఆగస్టు నెలలో పంచాయతీల్లో ఫాగింగ్ చేపట్టారు. అయితే మరలా ఇప్పటివరకు ఫాగింగ్ చేపట్టకపోవడంతో దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


మరమ్మతులకు గురైన ఫాగింగ్ యంత్రాలు

వేధిస్తున్న నిధుల లేమి

ఏడాది కాలంగా పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయకపోవడంతో పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో కనీసం పారిశుద్ధ్య పనులు కూడా చేపట్టడం కూడా కష్టంగా మారింది. మరోవైపు ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. అయితే పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేయించలేక మూలన పడేశారు. చెడిపోయిన యంత్రాలకు మరమ్మతులు చేపట్టాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుందని అధికారులు, సర్పంచ్‌లు తెలియజేస్తున్నారు. ప్రభుత్వం నూతన యంత్రాలు సరఫరా చేయాలని కోరుతున్నారు. కనీసం వర్షాకాలంలోనైనా ఫాగింగ్ చేపడితే దోమల కట్టడి కొంత వరకు సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు.

మూలకు చేరాయి


పంచాయతీలకు గత ప్రభుత్వం అందజేసిన ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరాయి. మరమ్మతులు చేపట్టడానికి పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. అందువలన ప్రస్తుత ప్రభుత్వం కొత్త ఫాగింగ్ యంత్రాలు సరఫరా చేసి, గ్రామాల్లో దోమల నివారణకు సహకరించాలి. వర్షాకాలంలో దోమల బెడదతో ప్రజలు రోగాల పాలవుతున్నారు.

– శిలగాన భాస్కరరావు, సర్పంచ్, సుంకిడి

పారిశుద్ధ్య నిర్వహణకు కృషి


గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు కృషి చేస్తున్నాం. దోమలు నియంత్రించడానికి గతంలో ఫాగింగ్ చేపట్టడం జరిగింది. యంత్రాలకు మరమ్మతులు చేపట్టి గ్రామాల్లో ఫాగింగ్ చేయించడానికి చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ ఈశ్వరమ్మ, ఎంపీడీవో, సోంపేట

నిధులు మంజూరు చేయాలి


రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయాలి. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు విడుదల చేసి సంవత్సరం పూర్తవుతోంది. మరలా అప్పటి నుంచి పంచాయతీల ఖాతాల్లో నిధులు జమచేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ కష్టంగా మారింది. కనీసం దోమల నివారణకు ఫాగింగ్ చేపడదామన్నా ఇబ్బందులు తప్పడం లేదు.

– తదక జోగారావు, సర్పంచ్, పలాసపురం

నూతన మూల్యాంకన విధానంతో సమయం వృథా


యూఆర్‌కేపురం పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసిన ఏపీటీఎఫ్ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు:

కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మూల్యాంకన విధానంతో ఉపాధ్యాయులకు బోధనా సమయం చాలా వృథా అవుతుందని ఏపీటీఎఫ్ (1938) జిల్లా ఉపాధ్యక్షుడు మామిడి భుజంగరావు అన్నారు. మండలంలోని గోవిందపురం పాత టెక్కలి పాఠశాల సముదాయ పరిధిలోని పాఠశాలల్లో ఏపీటీఎఫ్(1938) బృందం గురువారం పర్యటించి నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలిశెట్టి నాగేశ్వరరావు, గున్న సుభాష్‌లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, సరెండర్ లీవ్ మొత్తాలను తక్షణమే ఖాతాల్లో జమ చేయాలి డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీ కమిటీ ఏర్పాటు సహా పలు అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో ఆ శాఖ ప్రతినిధులు సురేష్, తులసీదాస్, కుమార స్వామి, అప్పారావు, మహందాత, కృష్ణారావు, హరికృష్ణ, కవీశ్వరరావు, నవీన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

128 మందికి వైద్య పరీక్షలు


ఉచితంగా మందుల పంపిణీ చేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మండలంలోని చొక్కవానిపేటలో కిమ్స్ ఫౌండేషన్, జెమ్స్ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో 128 మందికి వైద్య పరీక్షలను గురువారం నిర్వహించారు. డాక్టర్లు గిరీష్, అనసూయ వైద్య పరీక్షలు నిర్వహించి 69 మందికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం వర్షాకాలంలో ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ ఎస్.రాజారావు, సీహెచ్ గణపతి, సురాడ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వే పైకి వరద నీరు


కాజ్‌వే పైనుంచి పారుతున్న వరద నీరు

ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రా – ఒడిశా రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు బహుదా నది నిండికుండలా మారింది. దీంతో మండలానికి సంబంధించి సకాలంలో సాగునీరు అందడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే గురువారం సాయంత్రం బూర్జపాడు–డొంకూరు మధ్యనున్న కాజ్‌వే పైకి వరద నీరు రావడంతో స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. కాజ్‌వే పక్కనే నూతన వంతెన నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఎక్కడ తమ పనులకు ఆటంకం కలుగుతుందోనని కాంట్రాక్టర్ సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

డయాలసిస్ పరికరాలు ప్రారంభం

పలాస: స్థానిక కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో గురువారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష రూ.2 కోట్ల విలువైన డయాలసిస్ శస్త్ర చికిత్స యంత్ర పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బందిని కోరారు. రాష్ట్రంలోనే ఇది కిడ్నీ రోగులకు కట్టించిన ఒక ప్రత్యేకమైన ఆస్పత్రి అని పేర్కొన్నారు. లేప్రోస్కోపీ పరికరం వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని, అది అందుబాటులోకి రావడం కిడ్నీ రోగులకు మంచిదన్నారు. ఆస్పత్రిలో చాలా సమస్యలు ఇంకా ఉన్నాయని, ఒక్కొక్కటి పరిష్కారం అవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ, ఏపీ ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పాల్గొన్నారు.

దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

పలాస: పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీలో పింఛన్లు రద్దయిన దివ్యాంగులు మరలా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సూచించారు. తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పురపాలక సంఘంలో మొత్తం రద్దయిన పింఛనుదారులు 27 మంది కాగా, వారిలో 5 మందికి వృద్ధాప్య పింఛన్లుగా మార్పు చేయడం జరిగిందన్నారు. మిగతా 22 మంది మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, పరిశీలించి వారికి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తుందన్నారు. సదరం సర్టిఫికెట్, రద్దు చేస్తూ వచ్చిన నోటీసు, సంబంధిత డాక్యుమెంట్లు దరఖాస్తుతో పాటు జత చేయాలని సూచించారు. రద్దయిన పింఛనుదారులు తిరిగి వైద్య పరీక్షలకు హాజరవ్వాలన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

సోంపేట: మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దాస్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీలు శుభ్రపరచడంతో పాటు, పరిసరాలు పరిశుభ్రం చేయాలన్నారు. సమావేశంలో ఈవో పీఆర్డీ వెంకటరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సౌజన్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యాన్ని అందజేయాలి

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. మండలంలోని కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో, వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రి వైద్యులు సౌజన్య, భాస్కర మహంతి, గ్రామస్తులు రాంబుడ్డి గణపతి, మర్ల శంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్

అంగన్‌వాడీల నిరసన


పలాస: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు. ఈ మేరకు మండల కేంద్రాల్లో గురువారం ధర్నాలు చేపట్టారు. కనీస వేతనాలు పెంచాలని విన్నవించారు. మినీలను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, యాప్‌లు అన్నింటినీ కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, ఎఫ్ఆర్ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, 5జీ నెట్ ఇవ్వాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్


టెక్కలిలో ధర్నా చేస్తున్న సిబ్బంది


ఇచ్ఛాపురం రూరల్: వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పరిహారం అందజేయాలి

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధి చిల్లపుట్టుగ గ్రామంలో మే 26వ తేదీన జరిగిన విద్యుత్ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే వీరికి ఇంతవరకు సంబంధిత శాఖ నుంచి ఎటువంటి పరిహారం అందలేదు. అందువలన ఆ కుటుంబాలకు నష్ట పరిహారం మంజూరు చేయాలని ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వి.విజయలక్ష్మిని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు విశాఖపట్నం కార్యాలయంలో ఆమెను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు జె.శాసనాం గ్రామానికి చెందిన మదనాల గురుమూర్తికి చెందిన సొంత స్థలంలో అతని అనుమతి లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారని, దీన్ని అక్కడి నుంచి తొలగించాలని కోరారు.

ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు నేడు

వజ్రపుకొత్తూరు: మండలంలోని కంబాలరాయుడుపేట గ్రామంలో శుక్రవారం ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్షుడు లండ రుద్రమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక 7వ వార్షికోత్సవం పురస్కరించుకొని సాయంత్రం 6 గంటల నుంచి ప్రజా కళా మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గెలిపొందిన వారికి నగదు బహుమతి, జ్ఞాపికలు అందిస్తామన్నారు. కళాభిమానులు, కవులు, రచయితలు, ఉద్దానం ప్రజానీకం తరలి రావాలని కోరారు.

క్రికెట్ అభివృద్ధికి సహకరిస్తాం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో క్రికెట్‌ను అభివృద్ధి చేసేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ద్వారా పూర్తిగా సహకరిస్తామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ టాలెంట్ సెర్చ్ కమిటీ హెడ్ రవిచలం అన్నారు. పట్టణంలోని శ్రీసురంగి రాజా క్రీడా మైదానాన్ని కమిటీ ప్రతినిధులు గురువారం సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి హసన్‌రాజా, ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు దాసరి రాజు, లెవల్–1 కోచ్ మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నిర్మల

టెక్కలి: లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు రాజీ అయ్యేవిధంగా న్యాయవాదులు అవగాహన కల్పించాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల కోరారు. సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి సంబంధించి స్థానిక కోర్టు ఆవరణలో ముందస్తు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అత్యధికంగా కేసులు రాజీ చేసి తద్వారా కక్షిదారులకు కలిగే ప్రయోజనాల గూర్చి వివరించాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెక్కలి: మారుతున్న సాంకేతిక విద్యా విధానానికి అనుగుణంగా అధ్యాపకులు వారి నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సూచించారు. నూతన జాతీయ విద్యా విధానంపై గురువారం కళాశాలలో అధ్యాపకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాంకేతిక విద్యా విధానం, నైపుణ్యత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఈఈఈ హెచ్‌వోడీ ఎం.రమణయ్య, ఎంవీ.రత్నమణి, జి.వాసంతి, కె.లక్ష్మి, ఎస్.శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పూండి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 33కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల పనులు, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ యగ్నేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా పాతటెక్కలి, దేవునల్తాడ, రెయ్యిపాడు, పెద్దమురహరిపురం, అమలపాడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ నౌపడ ఫీడర్ వీసీబీ మార్పిడి, 33/11 కేవీ నౌపడ విద్యుత్ ఉప కేంద్రం మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని అధికారులు తెలిపారు. నౌపడ, హనుమంతునాయుడు పేట, మూలపేట, మేఘవరం, భావనపాడు, యామలపేట, మర్రిపాడు, ఆకాశలక్కవరం, ఎం.సున్నాపల్లి, ఇజ్జువరం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు, రొయ్యల చెరువులకు సరఫరా ఉండదన్నారు.

సింగిల్ విండో విధానంతో అనుమతులు

ఇచ్ఛాపురం: ఈనెల 27వ తేదీన వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసు అనుమతుల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన సింగిల్ విండో విధానం సద్వినియోగం చేసుకోవాలని సీఐ మీసాల చిన్నంనాయుడు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎరువు.. రైతు గుండె బరువు..!



- వేధిస్తున్న ఎరువుల కొరత
- ఆపసోపాలు పడుతున్న అన్నదాత
- పట్టించుకోని ప్రభుత్వం

పలాస:


గత వారం రోజులుగా వర్షాలు సక్రమంగా కురవడంతో అన్నదాత ఖరీఫ్ పనుల్లో మునిగిపోయాడు. వెద పద్ధతిలో సాగు చేసుకున్న రైతులకు ఇప్పుడు యూరియా, డీఏపీ అవసరం బాగా పెరిగింది. అలాగే దమ్ములు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే రైతుల డిమాండుకు తగ్గట్టుగా ప్రభుత్వం ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా సరఫరా చేయాల్సి ఉండగా అధికారులు చేతులెత్తేశారు. గత నెలలో ఒక్కో రైతుసేవా కేంద్రానికి 200 బస్తాల చొప్పున ప్రభుత్వం యూరియా సరఫరా చేసింది. అవి అప్పుడు అందుబాటులో ఉన్న రైతులు తీసుకున్నారు. ఇప్పుడు రైతులకు యూరియాతో పాటు డీఏపీ అవసరం ఉంది. దీంతో ఈ ఎరువుల కోసం ప్రైవేటు దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎరువుల దుకాణాలకు వెళ్తుంటే తిప్పించుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

పలాస మండలంలో...

పలాస మండలంలో మొత్తం 10,236 ఎకరాల్లో వరిపంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో సరిగా వర్షాలు లేని కారణంగా మొదట్లో రైతులు 8 వేలు ఎకరాల్లో వెదలు వేసుకున్నారు. మిగతా 2,500 ఎకరాల్లో ఇప్పుడు దమ్ములు చేస్తున్నారు. ఎకరాకి 25 కిలోల చొప్పున మొత్తం 183 టన్నులు ఎరువులు అవసరం ఉండగా, ప్రభుత్వం 50 శాతం మాత్రమే రైతు సేవా కేంద్రాలు ద్వారా సరఫరా చేసింది. అందులో కేవలం ఒక్క యూరియా మాత్రమే సరఫరా చేసింది. యూరియా కూడా కొన్ని రైతు సేవా కేంద్రాలకు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పలాస ఏఈ పోలారావు మాత్రం గత నెలలో అన్ని కేంద్రాలకు సరఫరా చేశామన్నారు. పరిమితికి మించిన మోతాదులో రైతులు ఎరువులు వాడుతున్నందువలనే ఇటువంటి ఇబ్బంది వచ్చిందని పేర్కొన్నారు. ఏదేమైనా గానీ ప్రస్తుతం పలాసలో ప్రైవేటు ఎరువుల దుకాణాలకు రైతులు క్యూ కడుతున్నారు. రైతుల డిమాండ్‌ను చూసి వ్యాపారులు కూడా కృత్రిమ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్ముతున్నార ని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులకు కావాల్సిన యూరియా, డీఏపీ కాకుండా మల్టిపుల్ ఎరువులను విక్రయిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అత్యవసరంగా ఎరువులు అవసరమవ్వడంతో వ్యాపారులు ఏమిస్తే అవి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.


ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద రైతులు

మార్కెట్‌లో దొరకడం లేదు


ప్రస్తుతం మార్కెట్‌లో ఎరువులు దొరకడం లేదు. పలాసలో దొరుకుతున్నాయని తెలిసి వచ్చాను. వీరు కూడా రేపు గానీ ఎల్లుండి గానీ రమ్మని చెప్పారు. నేను 2 ఎకరాలు కౌలుకు చేస్తున్నారు. పెట్టుబడి పెడితే పంట బాగా వస్తుందని ఆశతో వస్తే నిరాశే మిగిలింది. రైతులకు సరిపడా ఎరువులు ప్రభుత్వం అందజేస్తే బాగుంటుంది.

– మజ్జి హరికృష్ణ, పాత్రపురం, సోంపేట మండలం

ఆర్ఎస్‌కేల ద్వారా ఇవ్వడం లేదు


ప్రస్తుతం వర్షాలు పడడంతో ఎరువులకు డిమాండ్ బాగా పెరిగింది. గతంలో గ్రామంలో రైతు సేవా కేంద్రాలు ద్వారా ఎరువులు దొరికేవి. ఇప్పుడు ఇవ్వడం లేదు. గత నెల ఒక్కో బస్తా యూరియా ఇచ్చారు. ఇప్పుడు యూరియాతో పాటు డీఏపీ కూడా అవసరం ఉంది. నాకు 4 ఎకరాలు ఉంది. సుమారు నాలుగైదు బస్తాలు అవసరం ఉంది. ఎరువులు కోసం ప్రైవేటు దుకాణాల చుట్టూ తిరుగుతున్నాం.

– టొంప సోమేశ్వరరావు, శివరాంపురం, వజ్రపుకొత్తూరు మండలం